# చూపు

పాకిస్తానీ కథ
ఉరుదూ మూలం: అని సుజ్జమాన్
తెలుగు: డా|| దేవరాజు మహారాజు

"మన మాతృభాష బెంగాలీని అణగదొక్కి, ఉరుదూను బలవంతంగా రుద్దడానికి పాకిస్తాన్ నిరంకుశ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాటిని అన్నిచోట్లా ప్రజలు నిరసిస్తున్నారు. ప్రతిఘటిస్తున్నారు" -అంది సాలెహా. సాలెహా సాదత్‌ఖాన్ కూతురు. పెండ్లి కావల్సిన పిల్ల.

"ఏమిటమ్మా ఇదీ? దేశమంతా అల్లకల్లోలమైపోతోంది?" - విసుక్కున్నాడు సాదత్ ఖాన్.

"అవును అబ్బా జాన్! నిజమే!! రోజు రోజుకూ గొడవలు ఎక్కువైపోతున్నయ్. రాష్ట్ర భాష విషయంలో మెడికల్ కాలేజి విద్యార్థులు ఆందోళనలు ప్రారంభించారు. హాస్టల్ దగ్గర పోలీసులు కాల్పులు ప్రారంభించారు".

"కాల్పులా?" సాదత్‌ఖాన్ స్వరంలో అపనమ్మకం ధ్వనించింది.

"ఆఁ- అవును అబ్బాజాన్! ముందు టియర్ గ్యాస్ వదిలారట. తర్వాత లాఠీచార్జ్, అరెస్ట్‌లు చేశారట. అయినా సద్దుమణగలేదు. అందుకే ఫైరింగ్ చేశారట. కాల్పుల్లో ఆరుగురు చనిపోయారట. ఇప్పుడే తెలిసింది.

"ఏమిటి సాలెహా నువ్వంటున్నదీ. ఆరుగురు విద్యార్థులు చనిపోవడమే...!"

"అవును. చనిపోయారట. చాలా మందికి గాయాలయ్యాయట. కొందరిని ఆసుపత్రికి తరలించారట".

"ఏమిటీ ఇంత నిరంకుశమా? ఇంత విధ్వంసమా? ...అయినా ఎవరు చెప్పారు నీకివన్నీ?" వృద్ధుడయిన సాదత్‌ఖాన్ గొంతు వణికింది.

"మన పక్కింటి బచ్చూ చెప్పాడు లెండి! వాడు ఇప్పటిదాకా అక్కడే ఉండి, ఫైరింగ్ జరుగుతుంటే సందుల్లో పడి తప్పించుకువచ్చాడు. విషయాలు చెప్పి ఇప్పుడే వెళ్ళాడు-"

ఒక్కసారి సుషుప్తిలోంచి బయటపడి చైతన్య స్థితిలోకి వచ్చినట్లయ్యింది సాదత్ ఖాన్‌కు. "ఇంతటి విషమ పరిస్థితులు బ్రిటీష్ పాలనలో కూడా ఎదురుకాలేదు. ఇప్పుడేమిటి ఇలా? ...ఇంతటి దౌర్భాగ్యం? ఎటు పోతున్నాం మనం?" - అంటూ వాపోయ్యాడు.



"అధికారం ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు చేస్తే ప్రజలు ఊరుకునే పరిస్థితిలో లేరు. ఎంతకైనా తెగిస్తారు. ప్రతిఘటిస్తారు. తమకు కావల్సింది సాధిస్తారు" కోపంగా అంది సాలెహా. తన్నుకు వస్తున్న ఆవేశాన్ని అదుపు చేసుకుంటూ- వయసు పైబడిన తన తండ్రి బ్రిటీష్ పాలన కూడా చూసినవాడు. సున్నిత మనస్కుడు. ఇప్పుడతని ఆరోగ్యం సరిగా లేదు. ఆయనను ఇబ్బంది పెట్టొద్దని సాలెహాకు తెలుసు. అట్లని బయట జరుగుతున్న విషయాలు చెప్పకుండా దాచిపెట్టనూ లేదు.

ఏదో గుర్తొచ్చి సాలెహా అక్కడి నుండి వెళ్ళిపోయింది.

ఒంటరిగా నిశ్శబ్దంలో మిగిలిపోయిన సాదత్‌ఖాన్ మనసు వికలమైపోయింది. ఆలోచనలు ఆవేదన కలిగించాయి. 'ఈ ప్రపంచం మనుషులు జీవించడానికి అనువుగా లేకుండా త్వరితగతిన మారిపోతుందేమన్నది' ఆయన ఆలోచన!

ఆ సమయంలోనే ఆషాద్ ఇంటికి తిరిగొచ్చాడు. ఆషాద్ సాదత్‌ఖాన్ కొడుకు. ఉద్యోగం చేస్తూ ఈ కుటుంబాన్ని లాక్కొస్తున్నవాడు.

"ఏమిటీ ఆషాద్ నిజంగానే విద్యార్థులు చనిపోయారా?" సాదత్‌ఖాన్ తన ఆవేదనను బయట పెట్టాడు. అలా జరగకుండా ఉంటే బావుండునన్నది అతని ఆలోచన.

"ఆఁ. నిజమే అబ్బాజాన్!" -అన్నాడు ఆషాద్ బాధతో- సాదత్‌కు ఇంకా ఏమీ మాట్లాడాలని అనిపించలేదు. మళ్ళీ ఒంటరిగా తన ఆలోచనల్లోకి వెళ్ళిపోయాడు.

***

ఇటీవల సాదత్‌ఖాన్ కళ్ళజోడు పగిలిపోయింది. అది ఉంటేనే అతని చూపు అంతంత మాత్రం. అది లేకుండా అతనికి ఏదీ సరిగా కనబడదు. వార్తాపత్రిక అసలే చదవలేదు. అందుకే బయట జరుగుతున్న విషయాలు తెలుసుకోవడానికి అతను ఇతరుల మీద ఆధారపడాల్సి వస్తోంది. ముప్పయ్యేళ్ళు నడుం వంచి గుమస్తాగిరి చేసి అలసిపోయ్యాడు. ఏళ్ళకేళ్ళు ఫైళ్ళు చూసిన ఆయన కళ్ళకు ఇంకా ఏం బలముంటుంది?

పైగా ఆయనకు చిన్నప్పటి నుంచి కళ్ళ జబ్బు ఉంది. స్కూలు విద్యార్థిగానే కళ్ళ జోడు వాడాడు. ఆ రకంగా కళ్ళజోడు అతని శరీరంలో భాగమైపోయ్యిందనే చెప్పాలి. ఉద్యోగ విరమణ చేసి కూడా చాలా కాలమైంది. కాళ్ళూ, చేతులూ, బలహీనపడ్డాయి. ఆరోగ్యం క్షీణించింది. ఓ రోజు ఈదురుగాలి వచ్చి కిటికీ రెక్కలు టపటపా కొట్టుకున్నాయి. కిటికీలో ఉన్న లావుపాటి కళ్ళజోడు కిందపడి ముక్కలయ్యింది. కిటికీ పక్కనే మంచం మీద పడుకున్న సాదత్‌ఖాన్ లేచి, కళ్ళజోడు కోసం తడుముకున్నాడు. చేతికేమీ తగల్లేదు. కూతురు సాలెహాను కేకేశాడు.

ఆ అమ్మాయి ఆదుర్దాగా పరిగెత్తుకొచ్చింది. ఫలితంగా నేల మీద పడి ఉన్న అద్దాలూ, కళ్ళజోడు ఫ్రేమూ ఆమె గమనించలేదు. ఆమె కాలు వాటిమీదే పడింది. నుగ్గు నుగ్గయిన శబ్దం విని, ఎగిరి గంతేసింది. సాదత్‌ఖాన్ అర్థమైంది తన చూపు విరిగిపోయిందని! తను మరింత బలహీనపడ్డాడని!



**చూపు సరిగా లేనందువల్లే కదా ఆయన ఇతరుల మీద ఆధారపడుతున్నారూ? లేకపోతే ఆయన పరిస్థితి మరో రకంగా ఉండేది. హసీనాకు ఆ విషయం తెలుసు. అందుకే అంది– "కళ్ళజోడు వేయించుకోండి. ఇంట్లో కొంత డబ్బుంది. కొంత అప్పు తీసుకుందాం. వచ్చే నెల బాకీ తీర్చెయ్యొచ్చు. కళ్ళు కనబడకుండా ఎందుకు అవస్థ పడడం?"**

కొత్త కళ్ళజోడు కొనుక్కుని తన చూపు నిలబెట్టుకోవచ్చని సాదత్‌ఖాన్‌కు నమ్మకముంది. కానీ ఎప్పుడనేదే ప్రశ్న. అషాద్ జీతం కుటుంబానికి బొటాబొటిగా సరిపోతూ ఉంది. అందులో కొత్తగా పెండ్లి చేసుకున్నవాడు. సరదాగా భార్య హసీనాను తీసుకుని ఎటైనా వెళ్ళాలన్నా వాడి దగ్గర డబ్బు ఉండడం లేదు. పైగా ఆ అమ్మాయి గర్భిణి ఆమె ఆరోగ్యం కూడా చాలా ముఖ్యం. తన పెన్షన్ డబ్బులు సరిగా చేతికి రావడం లేదు. మరోవైపు కూతురు సాలెహా ఈడొచ్చిన పిల్ల. మంచి సంబంధం చూసి పెండ్లి చెయ్యాలి.

కళ్ళజోడు విరిగిపోవడంతో సాదత్‌ఖాన్ ఒక రకంగా నరకం అనుభవిస్తున్నాడు. కళ్ళు లేకపోతే మనిషికి ఏమి ఉండి మాత్రం ఏమి లాభం? గొంతు లేకపోయినా ఫరవాలేదు. కళ్ళు మాత్రం ఉండాలి– అని అనుకుంటాడు ఒక్కోసారి. అయినా ఊరికే చూసినంత మాత్రాన ఒరిగేదేముంది? ఒక మాట కూడా మాట్లాడకపోతే, కావల్సింది చెప్పుకోలేకపోతే... భావ ప్రకటన ఎలా సాధ్యం? మూగవాడికంటే తను నయం కదూ? భాష కూడా ఒక జాతికి చూపులాంటిదే! దాన్ని నిలబెట్టుకోవడం కోసమే యువత తిరగబడుతోంది. బలవంతంగా మరో చూపు అంటగడతామంటే ఎలా? ఎవరి భాషా సంస్కృతులు వారివైనట్లు ఎవరి చూపు వారిదే కదా?

ఆలోచనల్లోంచి తేరుకుని, సాదత్‌ఖాన్ కూతురిని పిలిచాడు. "సాలెహా ఒక పాన్ ఇచ్చి వెళ్ళమ్మా!" అని–

"ఇదిగో తీసుకోండి" అని అంది హసీనా.

గొంతు గుర్తు పట్టి సాదత్ మొహమాటంగా నవ్వాడు. "ఏమ్మా? నువ్వొచ్చావా! సాలెహా ఏం చేస్తోంది?" అని అడిగాడు. ఏ పనిలో ఉందో గానీ, సాలెహా రాలేదు. ఆకులు పుచ్చుకుని కోడలు హసీనా వచ్చింది.

"సాలెహా బయట బట్టలారేస్తోందండీ" చెప్పింది హసీనా.

"సాలెహా తెచ్చేదిగా తల్లీ! నువ్వెందుకు శ్రమ పడతావ్? నువ్విక విశ్రాంతి తీసుకుంటూ ఉండాలి!" మామగారి మాటలకు సిగ్గూ, సంతోషమూ కలిగాయి హసీనాకు. తన మామగారు ఎంతో మంచి మనిషి. తన గురించి ఎవరూ ఇబ్బంది పడగూడదన్నది అతని అభిమతం. తను గర్భిణినని, తనకు జాగ్రత్తలు చెబుతున్నాడనీ, గ్రహించింది. ఆయన ఆప్యాయతకు మురిసిపోయింది. 'పాన్' ఆయన చేతికి అందించింది.

చూపు సరిగా లేనందువల్లే కదా ఆయన ఇతరుల మీద ఆధారపడుతున్నారూ? లేకపోతే ఆయన పరిస్థితి మరో రకంగా ఉండేది. హసీనాకు ఆ విషయం తెలుసు.

అందుకే అంది– "కళ్ళజోడు వేయించుకోండి. ఇంట్లో కొంత డబ్బుంది. కొంత అప్పు తీసుకుందాం. వచ్చే నెల బాకీ తీర్చెయ్యొచ్చు. కళ్ళు కనబడకుండా ఎందుకు అవస్థ పడడం?"

"అవస్థ ఏముంది? నువ్వూ, సాలెహా నన్ను రెండు కళ్ళలా చూసుకుంటున్నారు. అయినా ఇప్పుడు ఇంట్లో డబ్బు ఉండడం అవసరం. ఎప్పుడు ఏ అవసరమొస్తుందో? ఇంతవరకు ఈ పాతప్రాణికి సేవ చేశావుగానీ, ఇప్పుడిక రాబోయే కొత్త ప్రాణి కోసం ఆలోచించు. జాగ్రత్తగా ఉండు. డబ్బు

చాలా అవసరమౌతుంది. నా కళ్ళజోడుకు తొందరేమీ లేదు" అన్నాడు సాదత్‌ఖాన్.

ముసిముసిగా నవ్వుకుంటూ హసీనా తల వంచుకుని వెళ్ళిపోయింది.

***

మరునాడు ఉదయం నిద్ర లేచిన సాదత్ ఖాన్ ఏం చెప్పాలనుకున్నాడో తెలియదు. ఆషాద్‌ను పిలిచాడు.

"ఆయన ఆఫీసుకు వెళ్ళిపోయారండీ- లేరు" దగ్గరగా వచ్చి చెప్పింది హసీనా.

"అరె, అప్పుడే వెళ్ళిపోయాడా?"

"అవును. ఇవ్వాళ శుక్రవారం కదా? పెందరాళే వెళ్ళాలి! అందుకే వెళ్ళిపొయ్యారు".

"ఎందుకు అబ్బాజాన్? ఏం కావాలి మీకూ? లేవండి. చాయ్ ఇస్తాను" అంది సాలెహా.

"ఆయన నిద్ర లేవడమే ఆలస్యంగా లేచారు. రాత్రి నిద్రే లేదు. రోడ్డు మీద గస్తీ తిరుగుతున్న పోలీసులు, తుపాకుల కాల్పులు, భయం! ఎవరికీ నిద్ర పట్టలేదు" అంది హసీనా తన భర్త ఆషాద్ గురించి చెబుతూ.

"నిజమేనమ్మా! నేనూ మేల్కొనే ఉన్నాను. ఇందాకే తెల్లవారాక కొంచెం కన్నంటుకుంది. అందుకే ఆలస్యంగా లేచాను" అన్నాడు సాదత్‌ఖాన్ కోడలితో-

సాలెహా టీ కప్పు తెచ్చిపెట్టింది-

"ఈయనగారి ఆఫీసులో హర్తాళ్ జరుగుతుందట. ఇవ్వాళ... వెళ్ళి, పరిస్థితి చూసి వస్తానన్నారు. బహుశా పెందరాళే వస్తారేమో" అంది హసీనా.

"ఇది ఎటొచ్చి ఎటు పోతుందో అబ్బాజాన్! అన్నయ్యవాళ్ళ ఉద్యోగాలు ఊడిపోతే మన పరిస్థితి ఏమిటీ?" -అంది సాలెహా.

నిజానికి ఆమె ఆ విషయం మాట్లాడాలని అనుకోలేదు. వృద్ధుడైన తండ్రికి స్వాంతన కూర్చే మాటలేవైనా చెబుదామని అనుకుంది. కానీ, తీరా నోరు తెరిచేసరికి, నిరాశ కలిగించే మాటలు బయటికొచ్చాయి. సాలెహా ఒక్క నిముషం మౌనం వహించింది. తనను తాను సంభాళించుకుని, తనకు తాను ఉత్సాహం తెచ్చుకుని, మాట మార్చి సరదాగా మాట్లాడదామని అనుకుంది. కాని ఆ పని ఆమెకు చేతకాలేదు.

సాదత్‌ఖాన్ దీర్ఘంగా ఆలోచిస్తూ "పోదు. ఉద్యోగం పోదు" అన్నాడు.

"అంత మందిని ఉద్యోగాల్లోంచి పీకేయడం అంత తేలికైన విషయం కాదు- కానీ..." అంటూ టీ చప్పరించాడు సాదత్ ఖాన్. అంతటా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ప్రతిరోజూ ఆ సమయానికి రోడ్డు మీది గుర్రబ్బళ్ళ, అరుపుల, కేకల, మోటారు వాహనాల చప్పుళ్ళన్నీ ఇంట్లోకి వినిపిస్తూ ఉండేవి. ఇల్లంతా గోల గోలగా ఉండేది. కాని, ఆ రోజు అలా లేదు. వారి పెంకుటిల్లు ప్రధాన రహదారి పక్కన ఉంది గనుక, ఆ చప్పుళ్ళన్నీ రోజూ వారికి అలవాటే!



వారికి అలవాటు లేనిది పగటిపూట కృత్రిమంగా ఏర్పడ్డ ఈ నిశ్శబ్దమే! ఆ నిశ్శబ్దం ఎందుకో వారికి భయానకంగా తోచింది. ఉత్తేజాన్ని అణిచేసినట్లు పట్టణమంతా నిశ్శబ్దంగా వణికిపోతోంది. దుకాణాలు తెరవ లేదు. నలుగురు కలిసి తిరగడం లేదు.

సాదత్‌ఖాన్‌కు ఎందుకో నిరాశ ఎక్కువైంది. చూపు లేక ప్రతిదానికీ ఇతరుల మీద ఆధారపడే తను బతికుండి ఏం చెయ్యాలీ? ఒక మంచి పనికోసం, మాతృభాషను రాష్ట్ర భాషగా నిలుపుకోవడం కోసం ఉద్యమంలో పాల్గొంటే యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ఉద్యమంలో మరణించినా... ఎవరికీ బెంగలేదు అనుకున్నాడు. కాని చూపు సరిగాలేని తను ఉద్యమానికి చూపుగా ఎలా మారతాడూ? ఎటని వెళతాడూ? ఏ దిశకు వెళ్ళాలన్నది చూపు ఉంటేనే కదా? సాధ్యపడేది? సామాన్య జీవితానికైనా, ఉద్యమ జీవితానికైనా 'చూపు'

**ఆమె గొల్లుమంది. హసీనా వారి దగ్గరకు వచ్చి ఏం గ్రహించిందో తెలియదు. ఆమె కూడా గొల్లుమంది. వీధి గుమ్మం దగ్గర వాళ్ళిద్దరు ఎందుకు గొల్లుమని ఏడుస్తున్నారో...సాదత్ ఖాన్‌కు అంతు పట్టలేదు.**

ప్రధానం కదా? ...అంటూ ఏవేవో ఆలోచించాడు. తను చనిపోతే ఏమవుతుంది? ఆషాద్ ఉంటాడు. ఆషాద్ చనిపోతే అతని పిల్లలుంటారు. జీవనయానం, సంఘర్షణలు తప్పవు. అవి నిరంతరం కొనసాగేవి. ఆలోచనలతో సాదత్‌ఖాన్ మెదడు వేడెక్కింది. హృదయం ఎందుకో జారిపోయింది. స్నానం ముగించుకుని, కూతురు చేయి పట్టుకుని హాల్లోకి నడిచి, ఆరామ్ కుర్చీలో విశ్రాంతిగా కూర్చున్నాడు. రోజూ ఆ సమయానికి కరకరమని ఆకలయ్యేది. బయటి ప్రపంచంలో నెలకొన్న భయానక యుద్ధ వాతావరణ ప్రభావం కాబోలు... అందరూ ముభావంగా ఉన్నారు. ఎవరి పనులూ చకచకా జరగట్లేదు. ఇంతలో ఎవరో వీధి తలుపు దబదబా బాదారు. మామూలుగా కాదు. ఆదుర్దాగా, ఆందోళనగా- సాలెహా పరుగు పరుగున వెళ్ళి తలుపు తీసింది.

వచ్చినవాడు హాలిం-

"ఓ హాలిం భయ్యా! ఎందుకంత తొందర? వస్తూనే ఉన్నాంగా?"

హాలిం, ఆషాద్‌తో కలిసి పనిచేసే ఉద్యోగి. ఈ కుటుంబానికి చాలా దగ్గరివాడు. కానీ అతను ఆ సమయంలో ఏదీ వినేట్టుగా లేడు. విషాద వదనంతో ఉన్నాడు. సాలెహాకు ఏం చెప్పాడో తెలియదు. ఆమె గొల్లుమంది. హసీనా వారి దగ్గరకు వచ్చి ఏం గ్రహించిందో తెలియదు. ఆమె కూడా గొల్లుమంది. వీధి గుమ్మం దగ్గర వాళ్ళిద్దరు ఎందుకు గొల్లుమని ఏడుస్తున్నారో...సాదత్ ఖాన్‌కు అంతు పట్టలేదు. సాలెహా, హసీనాల ఏడ్పుల మధ్యలో హాలిం ఏడుపు కూడా వినిపిస్తోంది. హాలింకు సాదత్‌ఖాన్ దగ్గర బాగా చనువుంది. ఉన్న ఫళాన లేచి, సాదత్‌ఖాన్ కర్ర చెడావులు వేసుకున్నాడు. కళ్ళజోడు లేదు. ఏమీ కనబడనప్పుడు ముందుకు అడుగేయటం అతనికి తెలియదు. భయం, కోపం, అసహాయత మూర్తీభవించినవాడిగా అయిపొయ్యాడు.

"హాలిం ఏమైందీ?" అని అరిచాడు భయంగా. నీరసంగా- ఆ మాటతో ముగ్గురూ ఒక్కసారిగా గొల్లుమన్నారు. ఎంతోసేపు ఏడుస్తూనే ఉన్నారు. సాదత్ ఖాన్‌కు ఎవరూ ఏమి చెప్పలేకపోయినా ఏదో అర్థమైంది. నిలువునా కూలిపొయ్యాడు. అతని కళ్ళెదుట అంతా కంటికి చీకటి.

"ఆఫీసు నుండి ఊరేగింపు బయలుదేరింది... తుపాకి గుండు ఆషాద్‌కు తగిలింది.. ఆసుపత్రికి తీసుకెళితే శవాన్ని కూడా ఇస్తారో ఇవ్వరోనని... ప్రయివేటు డాక్టర్‌కు చూపించాం. ఇంకెక్కడా చూపించే అవసరం లేదన్నాడు డాక్టరు..." ముక్కలు ముక్కలుగా ఏడుపు మధ్యలో హాలిం విషయాలు చెబుతూ పోయాడు.

హసీనా ఆషాద్ మృతదేహంపై పడి ఏడుస్తున్నట్టు అలికిడి అవుతోంది.

కొడుకు దేహం ఒకసారి తాకాలని ఆత్రంగా సాదత్‌ఖాన్ కొంచెం కొంచెంగా ముందుకు కదలసాగాడు. అతని చూపుకున్న అన్ని కోణాలూ కదిలిపొయ్యాయి. అంతా శూన్యమై... అంధకారమైపోయింది.

ఇక ఒకటే ఆశ! హసీనా గర్భంలో ఎదుగుతున్న బిడ్డ రూపురేఖలు అతనికి లీలగా కనిపించసాగాయి.

ఉద్యమం ఎదుగుతున్న బిడ్డ-

(బంగ్లాదేశ్ ఏర్పడక పూర్వం తూర్పు పాకిస్తాన్ నుండి వెలువడిన కథ. భాషోద్యమానికి స్ఫూర్తిదాయిని!)